క్లుప్తంగా

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

ప్రత్తిపాడు: మండలంలోని ఇ.గోకవరంలో తనకు, తన పంటకు నష్టం చేకూర్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత రైతు సత్తి వినోద్ కుమార్‌రెడ్డి చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బాధిత రైతు వినోద్ కుమార్ మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన తాను మండలంలోని ఇ.గోకవరంలో పది ఎకరాల పొలం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ భూమిలో తనను సాగు చేయకుండా కొంత మంది తరచూ అడ్డుపడుతూ తనపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రత్తిపాడు పోలీసులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

'సుఖీభవ' నమూనా చెక్కుల పంపిణీ



తుని నియోజకవర్గ రైతులకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తుని రూరల్: పీఎం కిసాన్– అన్నదాత సుఖీభవ పథకంలో తుని నియోజకవర్గంలో రైతులకు మొదట విడతగా రూ.18.66 కోట్ల లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. శనివారం తుని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె నమూనా చెక్కును రైతులకు అందజేశారు. రూ.ఏడు వేలు చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి నాగసోమరాజు, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, ఇన్‌చార్జ్ ఏడీఏ చంద్రశేఖర్, ఏఓ బి.అశోక్‌కుమార్, ఎంపీడీఓ కె.సాయి నవీన్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..



ప్రత్తిపాడులో రైతులకు నమూనా చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు: అన్నదాత సుఖీభవ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. ప్రత్తిపాడులో శనివారం అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకాన్ని ఆమె ప్రారంభించారు. నియోజకవర్గంలో 31,634 మంది రైతులకు మొదటి విడతగా రూ.21.32 కోట్ల నమూనా చెక్‌ను ఆమె రైతులకు అందజేశారు. అనంతరం పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో పాటు కూటమి నాయకులు ధాన్యంతో అభిషేకం చేశారు. జగ్గంపేట వ్యవసాయ శాఖ ఏడీఏ జి.శ్రీనివాస్, వ్యవసాయాధికారి జోకా అమృత, రౌతులపూడి ఎంపీపీ రాజ్యలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు వరుపుల రామకృష్ణ, దాసం శేషారావు, మాజీ జెడ్పీటీసీ జ్యోతుల పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు అందజేత



కిర్లంపూడిలో లబ్ధిదారుడికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం/జగ్గంపేట/కిర్లంపూడి/గండేపల్లి : నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నట్టు టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం, జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండల్లాలో నూతనంగా మంజూరైన పింఛన్లను శనివారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కిర్లంపూడి మండలంలోని 191 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. గోకవరం మండలంలో నూతనంగా మంజూరైన 158 పింఛన్లను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ, సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, ఏలేరు ప్రాజెక్ట్ చైర్మన్ బస్వా వీరబాబు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి

జగ్గంపేట: రైతులు వ్యవసాయంలో ఆధునిక పరికరాలను వినియోగించి తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధించాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 30820 మంది రైతులకు రూ.20.81 కోట్ల నమూనా చెక్కు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి నేతలు, రైతులు ధాన్యాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాండవకు జలకళ

- జలాశయంలో 371.2 అడుగుల నీటిమట్టం
- 10న ఆయకట్టుకు నీటి విడుదల
- నదీజలాలపైనే అన్నదాతల ఆశలు



సాగునీటితో కళకళలాడుతున్న తాండవ జలాశయం

కోటనందూరు: స్థానిక తాండవ జలాశయం సాగునీటితో తొణికిసలాడుతోంది. గత నెలలో తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు జలాశయంలో నీటి నిల్వలు క్రమంగా పెరిగాయి. ప్రస్తుతం 371.2 అడుగుల నీటి నిల్వలతో జలాశయం కళకళలాడుతోంది. కాగా ప్రాజెక్టులోని నీటి నిల్వల పైనే అన్నదాతల ఖరీఫ్ ఆశలు ఆధారపడి ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా. తుపాను మినహాయిస్తే రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురవలేదు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ ప్రశ్నార్థకంగా మారింది. అనేక ప్రాంతాల్లో వేసిన నారుమడులు ఎండిపోతున్నాయి. తాండవ జలాశయంలో నీటి నిల్వలు ఉన్నప్పటికీ కొంతమేరయినా వర్షాలు కురవకపోతే ఖరీఫ్ ఆశలు వదుకోవాల్సిందేనని అన్నదాత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

51,465 ఎకరాల ఆయకట్టు

తాండవ జలాశయ మొత్తం ఆయకట్టు 51,465 ఎకరాలు. ఈ ప్రాజెక్టు నుంచి అనకాపల్లి జిల్లాలో 32,500 ఎకరాలు, కాకినాడ జిల్లాలో 18,770 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఈ జిల్లాలోని కోటనందూరు మండలంలో 13,205 ఎకరాలు, తుని మండలంలో 4,482 ఎకరాలు, రౌతులపూడి మండలంలో 1089 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 380 అడుగులు కాగా కనిష్ట స్థాయి 340 అడుగులు. ప్రాజెక్టు నిబంధనల ప్రకారం జలాశయంలో 370 అడుగులు నీటి నిల్వలు ఉంటే నీటి విడుదలకు అనుకూలం. ప్రస్తుతం జలాశయంలో 371.2 అడుగుల నీటి మట్టం ఉంది. ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితుల్లో టెయిల్ ఎండ్ (శివారు)ప్రాంత రైతులు కూడా ఖరీఫ్‌లో నిర్భయంగా నాట్లు వేసుకోవచ్చని తాండవ అధికారులు చెబుతున్నారు. జలాశయం నుంచి అనకాపల్లి జిల్లాలోని ఎడమ ప్రధాన కాలువ ద్వారా 25,440 ఎకరాలు, కుడి ప్రధాన కాలువ ద్వారా 7,249 ఎకరాలకు నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల మేజర్ కాలువలు ద్వారా సాగునీరు అందిస్తున్నారు. ఈ జిల్లాలో కుడి ప్రధాన కాలువ ద్వారా 11,391 ఎకరాలు, ఎడమ ప్రధాన కాలువల ద్వారా 7,385 ఎకరాలకు కోటనందూరు, ఇండుగపల్లి, భీమవరపు కోట మేజర్ కాలువలు, టెయిల్ ఎండ్ బ్రాంచ్ కెనాల్ (టీఈబీసీ)ల ద్వారా ఆయకట్టు అవసరాలకు సాగునీరు అందిస్తున్నారు.

పుష్కలంగా నీటి నిల్వలు



తాండవ జలాశయంలో ప్రస్తుతం నీటినిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. ఆగస్టు 10న నీటిని విడుదల చేసేందుకు ముహూర్తం ఖరారు చేశాం. భవిష్యత్‌లో వర్షాలతో సంబంధం లేకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేస్తాం. టెయిల్ ఎండ్ ప్రాంత రైతులు సైతం ధైర్యంగా నాట్లు వేసుకోవచ్చు. ఖరీఫ్‌లో 100 శాతం ఆయకట్టుకు నీరందించేదుకు చర్యలు తీసుకుంటున్నాం.

అనురాధ, డీఈఈ, తాండవ జలాశయం



సీసీ కాలువలో ప్రవహిస్తున్న సాగునీరు (ఫైల్)

సీసీ కాలువలతో ప్రయోజనం

గతంలో కాలువలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో తాండవ నీరు శివారు ప్రాంతాలకు చేరేది కాదు. జలాశయం నుంచి నీటిని విడుదల చేసిన తరువాత మండలానికి రావడానికి చాలా సమయం పట్టేది. సాగు నీరు భూమిలో ఇంకిపోయి ఆశించిన స్థాయిలో పొలాలకు చేరేది కాదు. దీంతో ఆయకట్టు అవసరాలకు సాగునీటి సమస్య తలెత్తేది. దివంగత మహానేత వైఎస్ఆర్ తాండవ కాలువల సీసీ లైనింగు పనుల కోసం రూ. 55 కోట్లు మంజూరు చేశారు. ఆ పనులు పూర్తికావడంతో శివారు ప్రాంతాలకు సైతం పుష్కలంగా నీరు చేరే అవకాశం ఏర్పడింది. పంట పొలాలకు కూడా ఆశించిన స్థాయిలో సాగు నీరు చేరుతోంది.

రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి విడుదల

ఈ నెల 10న మధ్యాహ్నం 12 గంటలకు తాండవ జలాశయం నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నట్లు డీఈఈ పి.అనురాధ తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో ఆయకట్టు రైతుల ఇబ్బందులు తొలగించేందుకు నీటిని తొందరగా విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి నీటిని విడుదల చేస్తారన్నారు. ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీరు ఆయకట్లు అవసరాలకు 60 రోజుల పాటు సరిపోతుందని చెప్పారు.

ఆహార మార్పులతో సమస్యలకు చెక్



విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న నిర్వాహకులు

తుని: నెలసరి సమయంలో వచ్చే సమస్యలను ఆహారంలో తగిన మార్పులు చేసుకోవడం ద్వారా అరికట్టవచ్చని ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో క్షత్రియ సేవా సమితి, స్పేసెస్ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రుతుక్రమంలో వచ్చే సమస్యలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ నేటి మన జీవన విధానం, ఆహారపు అలవాట్లు మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. ముఖ్యంగా మహిళల్లో పెరుగుతున్న ఒత్తిడి, సమస్యలను అధిగమించేందుకు మెరుగైన జీవనశైలి అవసరమన్నారు. రుతుక్రమంలో ఎదురయ్యే సమస్యలు, పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మిల్లెట్, పాకశాస్త్ర నిపుణులు రాంబాబు, జీవన వైవిధ్య మండలి కో ఆర్డినేటర్ ముత్తా వెంకటరమణ, శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు చంద్రబాబు నైజం



రావికంపాడులో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న యనమల కృష్ణుడు, పార్టీ నాయకులు



కొత్త సూరవరంలో చంద్రబాబు మోసాలను ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు
- గ్రామాల్లో బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాలు

తొండంగి: అడ్డగోలు హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చాక వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ నాయకుడు యనమల కృష్ణుడు అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు శనివారం మండలంలోని కోదాడలో «బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారంటీ» కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు మరోసారి వెన్నుపోటు పొడిచారన్నారు. దగాకోరు చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం ఇంటింటా పర్యటించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన లబ్ధిని గుర్తు చేస్తూ బాబు పాలనలో జరిగిన మోసాన్ని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కొయ్యా మురళి, మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, యువజన విభాగం రాష్ట్ర సంయుక్తకార్యదర్శి మడదా హేమంత్, రాష్ట్ర బూత్ కన్వీనర్ విభాగం రాష్ట్ర కార్యదర్శి బెక్కం చంద్రగిరి, మండల యూత్ కన్వీనర్ పప్పల వెంకట్, పార్టీ నాయకులు ఆరుమిల్లి ఏసుబాబుచౌదరి, సిద్దా శ్రీనివాసరావు, వెల్నాటి గంగారామసత్యనారాయణ, సిద్దా సూర్యనారాయణ, కురుమెళ్ల రాంబాబు, అరిగెల శేష, మాజీ ఎంపీటీసీ చవలం సత్యనారాయణ, సారిక బాబ్జి, తదితర నాయకులు పాల్గొన్నారు.

వంచనలో చంద్రబాబు దిట్ట

తుని రూరల్: అభివృద్ధి, సంక్షేమం అంటూ ప్రజలను నమ్మించి మోసగించడంలో చంద్రబాబునాయుడు దిట్ట అని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు అన్నారు. మండలంలోని కొత్త సూరవరం, దొండవాక గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా పర్యటించి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని ప్రజలకు వివరించారు. అధికారమే పరమావధిగా చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చాడని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను మర్చిపోయాడన్నారు. వైఎస్సార్ సీపీ ఉద్యమాలతో అరకొరగా కొన్ని పథకాలు అమలు చేస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు అన్నంరెడ్డి వీర్రాఘవులు, లంక సత్యనారాయణ, దాడిశెట్టి దేవుడు, శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



శివరామపట్నంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కర్నాకుల వీరాంజనేయులు తదితరులు

గోకవరం: ప్రజాసంఘాలు, రైతు కూలీ సంఘం, అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (విజృంభణ), ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) ఆధ్వర్యంలో ఈ నెల 9న గంగవరంలో నిర్వహించే ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం గోకవరం మండలం శివరామపట్నంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ వేలాది సంవత్సరాలుగా ఆదివాసులు జంతువులు, పశుపక్షాదులతో సహజీవనం చేస్తున్నారన్నారు. నేషనల్ పార్కులు, పులుల సంరక్షణ కేంద్రాలు, అభయారణ్యాలు, వన్యప్రాణి కేంద్రాలు, నీటి ప్రాజెక్టులు, రవాణా మార్గాలు, ఖనిజాభివృద్ధి సంస్థలు, బొగ్గునిక్షేపాలు, రక్షణ అవసరాల కోసం అడవుల నుంచి ఆదివాసులను బహిష్కరించడం సర్వసాధారణమైందని ఆరోపించారు. ఆదివాసుల స్వయం పాలనను చాటుతూ ఈ నెల 9న ఎక్కడికక్కడే ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత కార్మిక సంఘాల సమైక్య జిల్లా కార్యదర్శి కుంచే అంజిబాబు, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, ప్రగతిశీల మహిళా సంఘం స్త్రీ విముక్తి జిల్లా నాయకురాలు సంగీత పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు



ఒమ్మంగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



రౌతులపూడి శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

రౌతులపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నేత వాసిరెడ్డి జమీలు ఆధ్వర్యంలో స్థానిక ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్థానిక మసీదుకు వెళ్లిన పార్టీ శ్రేణులు ముస్లిం సోదరులతో కలసి నమాజ్ చేశారు. స్థానిక గిడజాం సెంటర్‌లోని పెంతెకోస్తు చర్చిలో మండల పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడు ఎస్.శామ్యూల్, జ్యోతిబాబు తదితరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముద్రగడ ఆరోగ్యం కుదుటపడి సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని ఏసుక్రీస్తును ప్రార్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, వాసిరెడ్డి భాస్కర బాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, సోమరౌతు తిరముల వెంకన్నదొర, సర్పంచ్ శ్రీను, కొరుప్రోలు దేవుడు, సింగంపల్లి చిట్టిబాబు, నాయకులు రాయి ప్రసాద్, సైపురెడ్డి వెంకటరమణ, అచ్చిరెడ్డి సాంబ, గొల్లు వెంకటరమణ, మానెం వీరబాబు, ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్య కోసం ప్రత్యేక పూజలు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒమ్మంగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి నాని, కొప్పన వెంకన్నబాబు, చుక్కా రమణ, గొల్లపల్లి దొరబాబు, మర్రి కామేష్, సుంకర సూరిబాబు, రామకుర్తి సత్య రాజా తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: వి.కొత్తూరులోని ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, వృక్ష శాస్త్రం విభాగాల్లో అతిథి అధ్యాపకులుగా బోధించేందుకు అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత శనివారం ఓ ప్రకటనలో కోరారు. సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్ డిగ్రీ (పీజీ) ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఆయా సబ్జెక్టుల్లో ఎస్ఈటీ, ఏపీఎస్ఈటీ, పీహెచ్‌డీ చేసినవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల ఆరో తేదీన తగిన ధ్రువపత్రాలతో కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అభ్యర్థులకు అదే రోజు మౌఖిక పరీక్ష, సంక్షిప్త పాఠ్యాంశ బోధన ఇవ్వాల్సి ఉందని తెలిపారు.

బాధితుడికి దాడిశెట్టి రాజా పరామర్శ



తునిలో రాజును పరామర్శిస్తున్న దాడిశెట్టి రాజా

తుని: స్థానిక 9వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పిట్లల రాజు అనారోగ్యంతో బాధపడుతున్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా శనివారం రాజు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సబ్ జైలు, హాస్టల్‌లో తనిఖీలు



ప్రత్తిపాడు ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహంలో తనిఖీ చేస్తున్న జడ్జి గోపీనాథ్

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎల్.గోపీనాథ్ శనివారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేశారు. స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో వంటగది, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. వసతిగృహ సంక్షేమాధికారి చాముండేశ్వరికి పలు సూచనలిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక సబ్ జైలులో ఖైదీలుండే గదులు, ఆహార పదార్థాలు, ఫిర్యాదుల పెట్టెను తనిఖీ చేశారు. రిజిస్టర్లు, రికార్డులను జడ్జి గోపీనాథ్ పరిశీలించారు. కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ బొంగుబూరి మధుబాబు, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



శరభవరంలో రంగనాథం అబ్బాయిని పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని శరభవరంలో వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు (మురళీరాజు) శనివారం పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రంగనాథం అబ్బాయి, తేలు సింహాచలం (బుజ్జియ్య) ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీ అమరాది కాశీ, ఏళ్లబండి రమణ, ఏళ్లబండి వెంకటేశ్వరరావు, లోవరాజు, కోలా తాతబాబు, నాగేశ్వరరావు, దొరబాబు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రత్తిపాడు: ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రకృతి వరలక్ష్మి, ఈగల అనంతలక్ష్మి ఎన్నికయ్యారు. ప్రత్తిపాడు మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో శనివారం సాయంత్రం సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు అధ్యక్షతన మండల మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల కమిటీ నూతన కార్యావర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షురాలిగా దాక్షారపు సత్యవతి, సహాయ కార్యదర్శిగా మంగా లక్ష్మి, కమిటీ సభ్యులుగా బి. సీతాలక్ష్మి, ఎం.మహాలక్ష్మి, ఎం.అమ్మాజీ, ఎ.ద్రౌపది, రమణమ్మ, కాంతం, జి.లక్ష్మి ఎన్నికయ్యారు.

ముమ్మరంగా ఖరీఫ్ సాగు పనులు



జగపతిగనరంలో నాట్లు వేసిన వరిపొలం

కిర్లంపూడి: నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. ఇటీవల వర్షాలు కురవడంతో వరినాట్లు వేసే పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే మడుల్లో వరినారు ఎదగడంతో దమ్ములు పూర్తి చేసే పనులు నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 4700 హెక్టార్లలో రైతులు వరిసాగు చేస్తున్నారు. ప్రస్తుతం కిర్లంపూడి, రాజుపాలెం, ముక్కొల్లు, రామకృష్ణాపురం, వీరవరం, రామచంద్రపురం, గోనేడ, పాలెం, తామరాడ, గెద్దనాపల్లి, సోమరాయణంపేట, బూరుగుపూడి, కృష్ణవరం, సోమవరం, గెద్దనాపల్లి గ్రామాల్లో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. గత 5 రోజులుగా ఎండలు మండిపోవడంతో వర్షపు నీటిపై ఆధారపడే జగపతినగరం, సింహాద్రిపురం, వేలంక గ్రామాల్లో వరి నాట్లు మందగించాయి. ఈ నెల మూడో వారం నాటికి మండలంలో ఖరీఫ్ వరినాట్లు పూర్తియ్యే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి సుధా మాధురి తెలిపారు.

తాళ్లూరులో డీపీఓ ఆకస్మిక తనిఖీలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) వి. రవికుమార్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్య పనులు, తడి, పొడి చెత్త సేకరణపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. రక్షిత తాగునీటికి పరీక్షలు నిర్వహించి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓ వీవీఎస్ రామనాథ్, కార్యదర్శి షకీల పాల్గొన్నారు.

ఘనంగా విష్ణు సహస్రనామ పారాయణ



రత్నగిరిపై భజనలు చేస్తున్న కళాకారులు

అన్నవరం: రత్నగిరి కళావేదిక మీద శనివారం విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఏలూరు జిల్లా రంగాపురం గ్రామానికి చెందిన వంద మంది భక్తులు విష్ణుసహస్రనామ పఠనం, భజనలు చేశారు. అలాగే కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. కళాకారులతో పాటు ఈ బృందానికి నాయకత్వం వహించిన శ్రీమాన్ పెరుమాళ్‌ను దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు అభినందించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



చినశంకర్లపూడిలో పౌష్టికాహార ప్రదర్శన



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

- ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

ఏలేశ్వరం: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతితల్లి తమబిడ్డకు తల్లిపాలే ఇవ్వాలన్నారు. తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమన్నారు. తల్లి ముర్రిపాలు బిడ్డకు మొదటి టీకాగా పనిచేస్తుందన్నారు. తల్లిపాలు తాగని పిల్లలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలే మేలు

ప్రత్తిపాడు: బిడ్డకు తల్లిపాలే మేలు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.వరలక్ష్మి అన్నారు. మండలంలోని చినశంకర్లపూడి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. తొలుత తల్లి పాల విశిష్టతను తెలుపుతూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.